RNI NO : TELTEL/2023/88524

# మెదక్ టుడే
దిన పత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 185
శుక్రవారం, జూన్ 19, 2026 , పేజీలు - 4 వెల : 2/-

**జీవితం..!**

మనిషి పుట్టినప్పుడు
శత్రువులు, మిత్రులు ఉండరు.
అలాగే చనిపోయిన తరువాత కూడా
శత్రువులు, మిత్రులు ఉండరు.
అయితే మధ్యలోనే మనం చేసే
పనులవల్ల, మన మాట తీరువల్లే
మనకు శత్రువులు, మిత్రులు
ఏర్పడతారు.....!

### ప్రభుత్వ భూములు కబ్జా చేయాలని చూస్తే

# కఠిన చర్యలు..

## సీఎం వార్నింగ్



**రంగారెడ్డి, జూన్ 18 :** ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్య లు తీసుకుంటామని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిహెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకు వచ్చా మని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడు తున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఫైర్ అయ్యారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు(గురువారం) ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరిత నిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు.

### మైనార్టీ సంక్షేమానికి

# భారీ కేటాయింపులు

## : డిప్యూటీ సీఎం మల్లు



**హైదరాబాద్, జూన్ 18:** మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి భారీ కేటాయింపులు చేసినట్లు తెలిపారు. గురు వారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మైనార్టీ సంక్షేమ పనుల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్షను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ముషాయిరాలు నిర్వహిస్తామని అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో భారీ ముషాయిరాకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 20 మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రారంభానికి సిద్ధం చేస్తున్నామన్నారు. నిర్మాణంలో మరో 17 పాఠశాలలను ఉన్నాయని చెప్పారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.



### జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్.. ఆర్టీసీ ఉద్యోగులకు పొన్నం ప్రభాకర్

# శుభవార్త

**హైదరాబాద్, జూన్ 18:** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. ఈరోజు(గురువారం) టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

# కేబినెట్‌లో కీలక నిర్ణయాలు..


## వెల్లడించిన మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, జూన్18:** వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు మంత్రి ఉత్తమ్. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయిం చామన్నారు. రామగుండంలో తయారయ్యే స్పష్టం చేశారు.

### వీకెండ్‌లో సిరిసిల్లకు వచ్చి వెళ్లిపోతారు..

# కేటీఆర్‌పై కవిత సెటైర్లు



**సిరిసిల్ల, జూన్ 18 :** మాజీమంత్రి కేటీఆర్‌పై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. ఈరోజు (గురువారం) సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు..రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత పేర్కొన్నారు.

### అవినీతిపై పోరాటం, కులగణన సహా కీలక అంశాలు..

# రోడ్‌మ్యాప్ ప్రకటించిన సీఎం విజయ్



**తమిళనాడు :** జూన్ 18 ప్రారంభమైన 17వ అసెంబ్లీ మొదటి సమావేశాలు తమిళనాడు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. అయితే, ఈ సమావేశాల్లో రాష్ట్ర సార్వభౌమాధికారం, భాషా గుర్తింపును కాపాడుకుంటూనే జాతీయ సమగ్రతను గౌరవించేలా సరికొత్త సంప్రదాయానికి టీవీకే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అలాగే, గవర్నర్ ప్రసంగంలో తమ ప్రభుత్వ విధి, విధానాలు ఎలా ఉండబోతున్నాయని, కేంద్ర-రాష్ట్ర సంబంధాల గురించి స్పష్టంగా పేర్కొన్నారు. అవినీతిపై పోర్టటం కొనసాగుతుందని విజయ్ ఈ ప్రసంగం ద్వారా ఉద్ఘాటించారు. తమిళనాడు ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి శాసనసభ సమావేశాలు గురువారం ప్రారంభమ య్యాయి. మాజీ గవర్నర్ ఆర్.ఎన్. రవి హయాంలో అధికారిక కార్యక్రమాల క్రమం విషయంలో జరిగిన వివాదాలను గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ఆర్లేకర్ పునరావృతం చేస్తారేమోనని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్న తరుణంలో రాష్ట్ర గీతం 'తమిళ్ తాయ్ వాళ్తు'తో సమావేశాలను ప్రారంభించి సంప్రదాయాన్ని కొనసాగించారు. అయితే, సంప్రదాయానికి భిన్నంగా ఆ వెంటనే జాతీయ గీతాన్ని ఆలపించారు. సాధారణంగా గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత మాత్రమే జాతీయ గీతాన్ని ఆలపిస్తారు. దీంతో ఈ నిర్ణయం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. అనంతరం గవర్నర్ ఆర్వీ ఆర్లేకర్ తన ప్రసంగం ప్రారంభించారు. టీవీకే ప్రభుత్వ రోడ్ మ్యాప్‌ను గవర్నర్ చదివి వినిపించారు. జనగణనలో భాగంగా కులగణను పూర్తి చేయాలని, రాష్ట్రంలో సామాజిక న్యాయ సర్వే నిర్వహణకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని ప్రకటించారు. సామాజిక న్యాయానికి అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం అవసరమని, జాతీయ కుల గణన పూర్తయిన తర్వాత దీనిని అమలు చేస్తామని ఆయన తన ప్రసంగంలో స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగంలో కేంద్ర-రాష్ట్ర సంబంధాలు ఒక ప్రధాన అంశంగా నిలిచాయి.

### ఆక్వా రంగాన్ని పరిరక్షించే

# బాధ్యత కూటమి ప్రభుత్వానిదే



**అమరావతి, జూన్18:** ఆక్వా ఫీడ్ ధర తగ్గించాలని తయారీదారులను సీఎం చంద్రబాబు నాయుడు కోరడంతో వారు సానుకూలంగా స్పందించారు. దీంతో ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నిర్దేశించడంతో ఆక్వా ఫీడ్ ధర కేజీకి రూ.4 తగ్గించేందుకు తయారీదారులు అంగీకరించారు. దీంతో కేజీ ప్రస్తుతం రూ.112 నుంచి రూ.108కి ఫీడ్ ధరలు తగ్గనున్నాయి. ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతుల తోపాటు ఫీడ్ తయారీదారులతో ఆయన సమావేశమయ్యారు.

ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇవ్వడంపై ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వా సాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతోందని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరు సార్లు పెంచారని గుర్తు చేశారు. అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై చొరవ తీసుకోలేదని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దృష్టికి ఆక్వా రైతులు తీసుకెళ్లారు. తాము ఎప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించ లేదని.. ఇటీవల కొందరు రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంకు ఆక్వా రైతులు వివరించారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయే నాటికి అది రూ.107.80కి చేరిందని సీఎం చంద్రబాబుకు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందని రైతులు గుర్తు చేశారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకుని మరింత లాభాలు పొందేలా చర్యలు చేపట్టాలని రైతులకు సీఎం సూచించారు. లక్షలాది మంది ఆధారపడిన ఆక్వా రంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# బీబీ ఒకసారి ఆలోచించండి..

## మీకు కావాల్సినదే దక్కింది

## డొనాల్డ్ ట్రంప్



**అమెరికా :** ఇరాన్ దేశాల మధ్య కుదిరిన శాంతి ఒప్పందం ఇజ్రాయెల్‌కు ఉన్న అతిపెద్ద భద్రతా ప్రమాదాన్ని(అణ్వాయుధ ముప్పు) తొలగిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ ఒప్పందంతో ఇజ్రాయెల్‌కు ఇరాన్ నుంచి అణు దాడి జరిగే ప్రమాదం తగ్గిపోయిందని చెప్పారు. ఒప్పందంపై సంతకం చేయడానికి ముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో జరిగిన సంభాషణను అగ్రరాజ్య అధ్యక్షుడు వెల్లడించారు. జీ7 సదస్సు కోసం ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ట్రంప్ మాట్లాడుతూ.. 'బీబీ(నెతన్యాహూ).. ఒకసారి ఆలోచించండి. మీరు కోరుకున్న అత్యంత ముఖ్యమైన అంశమిదే. ఇక మీ దేశంపై అణు బాంబు ముప్పు ఉండదు. ఇరాన్ ఒకే ఒక్క అణు బాంబును ఇజ్రాయెల్ మధ్యలో ప్రయోగించినా దేశం తీవ్ర ప్రమాదంలో పడేది. ఇప్పుడు ఆ ప్రమాదం తొలగిపోయింది' అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో ఇజ్రాయెల్ సంతృప్తిగా ఉందని పేర్కొన్నారు. అగ్రరాజ్యం మద్దతు లేకుండా ఇజ్రాయెల్ భద్రత సాధ్యంకాదన్న ట్రంప్.. తాను అధ్యక్షుడిగా తీసుకున్న నిర్ణయాలు ఆ దేశానికి ఎన్నో ప్రయోజనాలు చేకూర్చాయని చెప్పుకొచ్చారు.

# ఏసీబీకి చిక్కిన బొల్లారం విద్యుత్ ఏఈ రామకృష్ణారెడ్డి



జిన్నారం, జూన్ 18:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి




లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు జిన్నారం మండలం బొల్లారం డివిజన్ విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణారెడ్డి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.బొల్లారంలోని పీపీఆర్ హాస్పిటల్ సమీపంలో ఇటీవల ఒక కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదానికి సంబంధించి విద్యుత్ కాంట్రాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఈ ఘటనపై ఎటువంటి పోలీసు కేసు నమోదు కాకుండా చూస్తానని, అందుకు ప్రతిఫలంగా రూ. 25 వేలు లంచం ఇవ్వాలని ఏఈ రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.

**ఏసీబీ వల:**

ఏఈ డిమాండ్‌తో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. వారి సూచనల మేరకు గురువారం మధ్యాహ్నం ఏఈ రామకృష్ణారెడ్డికి లంచం ఇస్తుండగా, రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఆయన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

**తనిఖీలు:**

ఏఈని అదుపులోకి తీసుకున్న అనంతరం, బొల్లారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఏసీబీ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కీలక పత్రాలను పరిశీలిస్తూ ఏఈని విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం





పటాన్‌చెరు, జూన్ 18:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి పటాన్‌చెరు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన గడప ప్రతిష్టాపన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పృథ్వీరాజ్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు రామ్మోహన్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నా వంతు కృషి: శాపురం నర్సింహారెడ్డి





పటాన్ చెరు, జూన్ 18:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి, నాణ్యమైన విద్యా వాతావరణాన్ని అందించడమే లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాపురం నర్సింహారెడ్డి అన్నారు. గురువారం ముత్తంగి డివిజన్ పరిధిలోని వెలిమల తండా ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్తులతో సమావేశమైన ఆయన, పాఠశాల విద్యా ప్రమాణాలు, ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల కొరతను, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

**సొంత నిధులతో అభివృద్ధి పనులు:**

ఉపాధ్యాయులు వివరించిన సమస్యలను సానుకూలంగా స్వీకరించిన శాపురం నర్సింహారెడ్డి, విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా పాఠశాల అభివృద్ధికి అవసరమైన పనులన్నింటినీ తన సొంత నిధులతో చేపట్టి, త్వరితగతిన పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "భావితరాలకు బంగారు బాటలు వేసేది పాఠశాలలే. అటువంటి విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించడం మనందరి బాధ్యత. ప్రజాప్రతినిధులుగా, సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తులుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తాను" అని పేర్కొన్నారు. నర్సింహారెడ్డి స్పందన పట్ల పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల విద్యపై ఆయన చూపుతున్న చొరవకు ధన్యవాదాలు తెలిపారు.


# విద్యుత్ వినియోగదారులకు గమనిక: ఈరోజు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం




పటాన్‌చెరు, జూన్ 18:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

పటాన్ చేరు రూరల్ విద్యుత్ శాఖ ఏఈ కార్యాలయం విడుదల చేసిన ప్రకటన మేరకు, రేపు జూన్ 19, 2026 (శుక్రవారం) నాడు అత్యవసర నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. వివరాలు: 33/11 కేవీ సుల్తాన్ పూర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్లపై చెట్ల కొమ్మలను తొలగించే పనులను విద్యుత్ శాఖ చేపట్టనుంది. దీనివల్ల ఉదయం 09:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ప్రభావిత ప్రాంతాలు: దయారా విలేజ్సుల్తాన్ పూర్గండిగూడెంఇండస్ట్రియల్ ఏరియా ఈ ప్రాంతాలకు చెందిన వినియోగదారులు గమనించి, సహకరించవలసిందిగా పటాన్ చేరు రూరల్ ఏఈ కోరారు. మరింత సమాచారం కోసం విద్యుత్ శాఖ అధికారులను 8712473239 నంబర్‌లో సంప్రదించగలరు.

# తెల్లాపూర్‌లో భక్తి పారవశ్యంలో ఘనంగా ముగిసిన శ్రీ శివ పంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం.



రామచంద్రపురం, జూన్ 18:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని రామచంద్రపురం మండల పరిధిలోని తెల్లాపూర్ జ్యోతిరావు పూలే గ్రామంలోని శ్రీ విజయదుర్గా పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో గౌరవనీయులు శ్రీమతి కొల్లూరి అమృతమ్మ -- శ్రీ కొల్లూరి సత్తయ్య దంపతులు, శ్రీమతి కొల్లూరి లక్ష్మి -- శ్రీ కొల్లూరి భరత్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శివ పంచాయతన సహిత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మూడు రోజులపాటు అత్యంత వైభవోపేతంగా, వేదఘోషల మధ్య భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన శివలింగ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ స్థాపన, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆలయ పరిసరాలను ఆధ్యాత్మిక కాంతులతో నింపాయి. శివనామస్మరణ, వేదమంత్రాల ధ్వనులు, హోమ యజ్ఞాలు, ప్రత్యేక పూజలతో ఆలయ ప్రాంగణం శివమయంగా మారి భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాశీ పీఠాధీశ్వరులు పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ శివనాగేంద్ర సరస్వతి మహాస్వామి వారు, పరమపూజ్య శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారు ప్రతిష్ఠా కార్యక్రమాలను ప్రారంభించి, వేదాశీర్వచనాలతో భక్తులను అనుగ్రహించారు. వారి దివ్య సందేశాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపాయి. అలాగే ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్, నీలం మధు, గువ్వల



బాలరాజు, కాటా శ్రీనివాస్ గౌడ్, జగదీశ్వర్ గౌడ్, జోగిని శ్యామల, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, మెట్టు కుమార్, సీపీ రెడ్డి, రాజు గౌడ్, సుధాకర్, పుష్ప నగేష్ తదితర ప్రముఖులు పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఈ ఆధ్యాత్మిక మహోత్సవంలో వేలాదిగా తరలివచ్చిన భక్తులు శివపంచాయతన దేవతలను, నవగ్రహాలను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహోత్సవం సందర్భంగా నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తి, సేవ, సంప్రదాయం, సనాతన ధర్మ వైభవానికి ప్రతీకగా నిలిచిన ఈ మహోత్సవం తెల్లాపూర్ ప్రాంత చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. భక్తులందరూ శివకృప, నవగ్రహ అనుగ్రహాలతో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు పొందాలని స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

- గస్తీ, నాకాబందీలతో నేర నియంత్రణకు చర్యలు
- స్టేషన్ తనిఖీలో పెండింగ్ కేసులపై ఆరా
- రామాయంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ.డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్



మెదక్,జూన్,18,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పరిష్కరించాలని, నేర నియంత్రణకు గస్తీ, నాకాబందీలను మరింత ముమ్మరం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం రామాయంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణ, స్టేషన్ నిర్వహణ,తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న కేసులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ-సాక్ష్య యాప్ ద్వారా సంఘటన స్థలంలోని డిజిటల్ ఆధారాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు, కేసుల వివరాలను సీసీ టీఎన్ఎస్ లో సకాలంలో నమోదు చేసి నవీకరించాలని అధికారులను ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, రాత్రి గస్తీలు, వాహనాల తనిఖీలు, నాకాబందీలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా ఙఙఙ.ఝఎఎవతీఝతీఱఎవ.ప్తశీజ.ఱఅలో ఫిర్యాదు చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఎస్పీ సూచించారు. ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని పేర్కొన్నారు. ఎస్పీ వెంట సీఐలు సైదా, సందీప్ రెడ్డి, ఎసై బాలరాజు ఉన్నారు.

# పారదర్శకంగా కానిస్టేబుళ్ల బదిలీలు

**- కౌన్సిలింగ్ ద్వారా 80 మంది కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు**
**- పారదర్శక బదిలీలే సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాది**
**-- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్**



మెదక్,జూన్,18,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)
మెదక్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్ల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న 80 మంది కానిస్టేబుళ్లకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయించారు.ప్రతి కానిస్టేబుల్‌తో ఎస్పీ వ్యక్తిగతంగా మాట్లాడి వారి విల్లింగ్ స్టేషన్లు, జీవిత భాగస్వామి ఉద్యోగ స్థానం (స్పౌస్), సీనియారిటీ, ఆరోగ్య పరిస్థితులు, సర్వీస్ రికార్డు, పిల్లల విద్య వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా బదిలీల ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పారదర్శకమైన బదిలీల విధానం సిబ్బందిలో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా బాధ్యతాయుతమైన విధుల నిర్వహణకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.పోలీసు అధికారిగా నైతిక విలువలు, సేవాభావం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఎస్పీ, విధుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. కొత్తగా పోస్టింగ్‌లు పొందిన కానిస్టేబుళ్లు తమ పోలీస్ స్టేషన్ పరిధిలో అంకితభావంతో విధులు నిర్వహించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సందీప్ రెడ్డి, సూపరింటెండెంట్ వల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వన మహోత్సవం







మెదక్,జూన్,18,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)
మెదక్ జిల్లా అక్కన పేటలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన వన యోజన పార్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా గుర్రం గూడ నుండి వర్చువల్ గా ప్రారంభించగా.మెదక్ ఎంపీ రఘునందన్ రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి అక్కన్నపేట వన యోజన పార్కును ప్రారంభించారు.అనంతరం నీడను ఇచ్చే మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని ఎంపీ రఘునందన్ రావు ప్రారంభించారు.పర్యావరణహితం కోసంప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు.అటవీ సంరక్షణ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి జిల్లా గుర్రం గూడాలో 17 కోట్లతో నిర్మించినపార్కు మినహా రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 11 పార్కులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా ప్రారంభించారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.11 పార్కులకు సంబంధించి అర్బన్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కింద ఒక్కొక్క పార్కుకి రెండు కోట్ల రూపాయల చొప్పున కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది అన్నారు. అక్కన్నపేటలో నిర్మించిన వన యోజన అర్బన్ పార్కు కు కోటి నలభై లక్షలు రూపాయలతో వివిధ రకాల పనులు చేపట్టడం జరిగింది అన్నారు.దీనికి భారత ప్రభుత్వానికి ఎంపీ రఘునందన్ రావు కృతజ్ఞతలు తెలిపారు.వెయ్యి ఎకరాల్లో ఉన్న ఈ పార్కును మరింత అభివృద్ధి చేయడానికి అటవీశాఖ అధికారులతో కలిసి నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.ప్రతి ఒక్కరూ చెట్ల సంరక్షణ అనేది వంతుకు మొక్కలు నాటే కార్యక్రమంల కాకుండా. భావితరాలను దృష్టిలో ఉంచుకొని మొక్కలు నాటాలన్నారు. ప్రస్తుతం సమాజంలో నీళ్ల బాటిల్ ను ఎలా పట్టుకొని తిరుగుతున్నామో భవిష్యత్తులో ఆక్సిజన్ సిలిండర్ ను పిల్లల వీపుకు వేసి పంపాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.. అందుకే ప్రతి ఒక్కరుఇంటిని సంరక్షించుకున్నట్టే ప్రకృతిని ప్రేమిస్తూ పర్యావరణ హితం కోసం పాటుపడాలని కోరారు.మెదక్ నుంచి ఎల్కతుర్తి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారికి ఇరువైపులా జులై మొదటి వారంలో ఏకకాలంలో నేషనల్ హైవే అధికారులు,అన్ని గ్రామాల సర్పంచులు, యువత, జిల్లా అటవీశాఖ అధికారులు ఇతరులతో కలిసి 20వేల పండ్ల మొక్కలను నాటే కార్యక్రమం కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. పాత మెదక్ రోడ్డుకు ఇరువైపులా ఏ విధంగా అయితే పెద్ద పెద్ద వృక్షాలు బాటసారులకు నిడనిచ్చాయో అదే తరహా మొక్కలు నాటుతామన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ, భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొక్కలు నాటడం జరిగిందని తెలిపారు. 2026 వనమహోత్స వంలో జిల్లాకు కేటాయించిన 31 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు. రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. అంతకుముందు అక్కన్నపేట వన యోజన వన యోజన పార్కును ప్రారంభించిన అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్ను తిలకించి మెదక్ ఎంపీ కలిసి మొక్కలు నాటి వన మహోత్సవాన్ని ప్రారంభించారు.అటవీ ప్రాంతంలో వనమహో త్సవం కార్యక్రమంలో , డిఎఫ్ఓ జో.జి , డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, తాసిల్దార్ రజిని , ఎంపీడీవో , సర్పంచ్బి యాదగిరి పాల్గొన్నారు.

## ఏడేళ్ల ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ - అందుబాటులోకి 'జహీరాబాద్ త్రివేణి వనం'




హైదరాబాద్: కాంక్రీటు అడవులుగా మారుతున్న పట్టణాల్లో పచ్చదనం క్రమంగా కనుమరుగవుతోంది. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కరవవుతున్న తరుణంలో దినదినాభివృద్ధి చెందుతున్న జహీరాబాద్ వాసులకు సరికొత్త ఆహ్లాదం అందుబాటులోకి రానుంది. పట్టణ ప్రజలు ఏడేళ్లుగా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న 'త్రివేణి వనం ఫారెస్ట్ ఈకో పార్కు' ఎట్టకేలకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నేడు(గురువారం) సీఎం రేవంత్ రెడ్డి సాయంత్రం వర్చువల్‌గా త్రివేణి వనం పార్కును ప్రారంభించనున్నారు.జహీరాబాద్ పట్టణ శివారులో, హైదరాబాద్–ముంబయి జాతీయ రహదారి పక్కన, మహీంద్రా కర్మాగారానికి సమీపంలో 200 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ 'అర్బన్ ఫారెస్ట్ పార్కు'ను నిర్మించారు. ఏడేళ్ల క్రితం సుమారు రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో ఈ పార్క్? నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అటవీ ప్రాంతాన్ని కాపాడుతూనే, పట్టణ ప్రజలకు ప్రశాంతతను పంచేందుకు చేపట్టిన ఈ పార్కు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. ఈ వారంలోనే సందర్శకులకు స్వాగతం పలికేందుకు 'త్రివేణి వనం' సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. హరిత నిధి పథకంలో రూ. 55 లక్షలతో పార్కును సకల సౌకర్యాలతో తీర్చిదిద్దారు.వనం పార్కులో ఏమేమి ఉన్నాయంటే : పిల్లల నుంచి పెద్దల వరకు అందర్నీ ఆకట్టుకునేలా ప్రధాన ముఖద్వారం, అటవీ మధ్యలో గజెబో, వాచ్ టవర్ల నిర్మాణం పూర్తి చేశారు. సందర్శకులు సేద తీరేందుకు నాలుగు రచ్చబండలు, అటవీ జంతువుల దాహం తీర్చడంతో పాటు ప్రజల అవసరాల కోసం సోలార్‌తో నడిచే బోరు బావులను తవ్వించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నడిచేందుకు 5 కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్ (కాలినడక మార్గం) సిద్ధం చేశారు. యోగా ఏకకాలంలో 50 నుంచి 80 మంది ప్రశాంతంగా ధ్యానం చేసుకునేలా రెండు విశాలమైన యోగా షెడ్లు, చిన్నారులను ఆకట్టుకునేలా ప్రత్యేకంగా 'చిల్డ్రన్స్ ప్లే ఏరియా', వీటితో పాటు వాష్‌రూమ్స్, సెక్యూరిటీ గది నిర్మాణ పనులు పూర్తయ్యాయి.జహీరాబాద్ పట్టణంలో అటవీ శాఖ ద్వారా ఫారెస్ట్ ఎకో పార్కు త్రివేణి వనాన్ని సాయంత్రం 4 గంటలకు వర్చువల్ ఇనాగరేషన్ సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఇందులో ధ్యాన మందిరం, చిన్న పిల్లల ఆటస్థలం, సెక్యూరిటీ రూం, టాయిలెట్స్, యోగా షెడ్, వాచ టవర్, గజెజో కట్టడం జరిగింది – శ్యాంసుందర్ రావు, అటవీ క్షేత్రాధికారి జహీరాబాద్ఏడేళ్ల తర్వాత పార్క్ నిర్మాణ పనులు పూర్తవడంతో అధికారులు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. గత పక్షం రోజులుగా అధికారులు పార్కులో అవసరమైన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ శాఖ మంత్రి సీతక్క, జిల్లాకు చెందిన మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే మాణిక్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.త్రివేణి వనం పార్కు జహీరాబాద్ వాసులకు, పరిసర గ్రామ ప్రజలకు చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. జహీరాబాద్? చుట్టుపక్కల చాలా ఇండస్ట్రీస్ ఉన్నాయి. ఈ పార్కు ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. దీనికోసం ప్రజలు ఎంతగానో ఎదురు చూస్తున్నారు

# రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**- నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడమే ప్రభుత్వ లక్ష్యం**
**- పారదర్శక సేవలతో రైతుల విశ్వాసం పొందాలి**
**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్,జూన్,18,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)
రైతులు యూరియా యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలని, జిల్లాలో యూరియా కొరత లేదని, ప్రస్తుతం 6300 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలదని రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.మెదక్ జిల్లాలో యూరియా సరఫరా విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ యూరియా కోసం యాప్ రూపొందించడం జరిగిందని రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకుని సమయానికి అనుగుణంగా డీలర్స్ దగ్గరకు వెళ్లి అవసరానికి అనుగుణంగా యూరియా తీసుకువచ్చున్నారు. యూరియా కోసం రైతులు భారీ క్యూ లైన్లు కట్టవలసిన అవసరం లేదని ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్స్, మార్క్ ఫెడ్ లో 6,300 మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టార్ట్ కలదనీ ప్రతి మండలంలో రెండు మూడు డీలర్ పాయింట్లు వద్ద యూరియా స్టాక్ అందుబాటులో ఉంచుతున్నాం అని వివరించారు. రైతులు సమన్వయం పాటిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉండేలా రైతు సేవ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలె సూచించారు.ఐకేపీ రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులు, విత్తనాలు, పురుగుమందులకు సంబంధించిన లైసెన్సులను దుకాణంలో స్పష్టంగా కనిపించే విధంగా భద్రంగా ప్రదర్శించాలని ఆదేశించారు.రైతులు కొనుగోలు చేసే వ్యవసాయ ఇన్‌పుట్‌లపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు ఎలాంటి నష్టాలు కలగకుండా నాణ్యమైన విత్తనాలు, ప్రమాణాలకు అనుగుణమైన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.నకిలీ (లేదా) నాసిరకం ఉత్పత్తులకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలు అందించాలన్నారు.వ్యవసాయ రంగ అభివృద్ధిలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రైతులకు నాణ్యమైన సేవలు అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపునకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు.

## పారదర్శక ఓటరు జాబితా కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు.







పాపన్నపేట,జూన్,18,(మెదక్ టుడే న్యూస్)
ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ఎస్.ఐ.ఆర్ సర్వేను పురస్కరించుకుని మెదక్ జిల్లా పాపన్నపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్ ప్రోగ్రాం పై బిఎల్ఓ లకు బిఎల్ఎ లకు బి ఎల్ ఓ సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గురువారం గ్రామీణ నియోజకవర్గ బూత్ లెవెల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఎస్.ఐ.ఆర్ సర్వే నిర్వహణ తీరుతెన్నులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే ఎలా చేయాలి, ఏయే అంశాలను పరిశీలించాలి, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పాటించాల్సిన పద్ధతులపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ కీలక అంశాలను వివరిస్తూ బీ.ఎల్.ఓలకు దిశానిర్దేశం చేశారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఎ లు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటరు మ్యాపింగ్ ను పూర్తి చేయాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ నిర్వహణలో పాల్గొంటున్న బీ.ఎల్.ఓలకు సర్వే కాలంలో నెల రోజుల పాటు వారి శాఖలకు సంబంధించిన దైనందిన విధుల నుంచి మినహాయింపు కల్పించారని కలెక్టర్ తెలిపారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఎస్.ఐ.ఆర్ పైనే పూర్తి స్థాయిలో దృష్టిని కేంద్రీకరిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు ఇతర ప్రాంతానికి శాశ్వతంగా వలస వెళ్ళారా, మృతి చెందారా, రెండు చోట్ల పేర్లు ఉన్నాయా అనే అంశాలను నిశితంగా గమనించాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ సర్వే వివరాల ఆధారంగానే ఓటరు జాబితాను రూపొందించనున్న దృష్ట్యా పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా సర్వే జరపాలని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఏమాత్రం సంకోచించకుండా శిక్షణ తరగతులలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క ఓటరు కూడా తప్పిపోకుండా చూడాలని, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర వి.ఐ.పీల మ్యాపింగ్ పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓ.టీ.పీని ఇతరులకు తెలుపకుడదని, ఇలా చేయడం పరిగణించబడుతుందని జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి సంబంధిత బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి




**వరంగల్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి చే ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గండ్ర రమణా రెడ్డి చేతుల మీదుగా హన్మకొండలోని అంబేద్కర్ భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని శాఖల్లో కలిపి లక్షా 67 వేల ఉద్యోగాలు ఇచ్చింది.పరోక్షంగా ప్రయివేటు రంగంలో స్వాతంత్య భారత దేశంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు కల్పించార న్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఉన్న ప్రయివేటు కంపెనీలు తరలి వెళ్లే పరిస్థితి వచ్చి ఎక్కడా ఉద్యోగ కల్పన జరగడకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రతిఆ రెండేళ్లకోసారి పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక అనవాయితీగా ఉండేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 30 నెలల కావొస్తున్నా ఒక్క పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. విద్యా రంగాన్ని సైతం నిర్వీర్యం చేసే కుట్ర సాగుతుంది. ఇప్పటి వరకు ఏ ఒక్క యూనివర్సిటీలో కూడా అధ్యాపక పోస్ట్ లు భర్తీ చేయడం లేదు.ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అని నోటికొచ్చిన హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ప్లేట్ పిరాయించారని మండిపడ్డారు. నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఉన్నత విద్యావంతుడు నిరుద్యోగ యువత సమస్యలు నిత్యం వారు పడే కష్టాలు చూసే వ్యక్తి కాబట్టి మీ అందరి కోసం యాప్ ను రూపొందించిన ఉచితంగా మీకు అందించడం నిజంగా అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రొఫెసర్ తిర్నారి శేషు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, ప్రముఖ న్యూరో వైద్యులు నవీన్ ఉన్నారు.

## యూరియా యాప్ రద్దు చేయాలని

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధర్నా




**నిజామాబాద్ :** యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజర య్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దుకాణాల్లో లేని యూరియా బస్తాలు యాప్ ద్వారా ఎలా రైతులకు అందుతాయని ప్రశ్నించారు. యాప్ వల్ల గ్రామాల్లో రైతులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు

## నెల్లుట్ల ఫ్లైఓవర్ వద్ద ఘోర ప్రమాదం


# లారీ ఢీకొని ముగ్గురు దుర్మరణం




**జనగామజిల్లా:** లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపం లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హనుమ కొండ-హైదరాబాద్ జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలానికి చెందిన జాట్ రోహిత్ (22) హైదరాబాద్ నుంచి బొలెరో వాహనంలో సామాన్లు తీసుకుని వస్తుండగా నెల్లుట్ల ఫ్లైఓవర్ సమీపంలో టైర్ పంక్చర్ అయింది. దీంతో గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామానికి చెందిన తన డ్రైవర్‌ను జాకీ తీసుకుని రావాలని రోహిత్ చెప్పాడు. ఈ క్రమంలో దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన దొనికెన్ని రాజేందర్ (27) తన లారీలో హనుమకొండ వైపు వెళ్తూ వీరిని గమనించి సాయం చేసేందుకు రోడ్డుపక్కన వాహనాన్ని ఆపాడు. ముగ్గురూ కలిసి బొలెరో వాహనం వద్ద ఉండగా, హనుమకొండ వైపు నుంచి అతివేగంగా వచ్చిన మరో లారీ వెనుక నుంచి బొలెరోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టిన కారు

# ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి



**హైదరాబాద్:** హైదరాబాద్ శివారులో రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తుర్కపల్లి సమీపంలోని మురహరిపల్లి వద్ద కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న ఓ కారు డివైడర్ ఎక్కి.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నది. ఈ రోడ్డు ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

## బాన్సువాడ మున్సిపాలిటీ లో ఎస్సీ కార్పొరేషన్

# రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక



**బాన్సువాడ జూన్ 18 :** బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ కింద 6 యూనిట్లు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. ఆరు యూనిట్ల లలో 3 త్రీ వీలర్స్ ప్యాసింజర్ ఆటో, గూడ్స్ ఆటోలు 60 శాతం సబ్సిడీపై, 3 ద్విచక్ర వాహనాలు ఇద్దరికీ 60 శాతం సబ్సిడీ, మహిళా కోటాలో 33.33 శాతం కింద ఒక ద్విచక్ర వాహనంతో పాటు ఒక యూనిట్ వ్యవసాయా పంపు సెట్ మోటార్, రెండు గేదెలు లతో కూడిన 6 యూనిట్లు మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ లో యూనిట్లకోసం 24 దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ సిద్ధార్థ మహాపతర, ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ నరేష్, పాల్గొన్నారు.

## వర్షాలు సంవృద్ధిగా కురవాలని

# వన దేవతకు ఆదివాసుల పూజలు



**నార్నూర్ :** ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం రాంపూర్‌లో ఆదివాసులు అకాడి పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సమీపంలోని శివారులో వన దేవత కు సాంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పశువులకు కొత్తగా చిగురించిన మేతను తినిపించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని , పంట దిగుబడి రావాలని, మూగజీవాలకు, పశు కాపర్లకు విష జంతువుల నుంచి ఎలాంటి హాని కలుగకుండా రక్షణ కల్పించాలని వన దేవతకు వేడుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హెచ్ కె జంగు పటేల్, దేవారి రూప్ దేవ్, జగ్గేరావు, సీతారాం, దేవ్ రావు, పాండు, దాది రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అద్దె కరువై వేములవాడలో

# వీధిన పడిన కుటుంబం



**వేములవాడ, జూన్ 18 :** కనీస అద్దె కరువై వేములవాడ పట్టణంలో ఓ కుటుంబం వీధిన పడింది. జగిత్యాల జిల్లా ఎకిన్ పూర్ చెందిన సతీష్ తో రామిడి మానసకు వివాహం కాగా వారి దాంపత్య జీవితంలో ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. అయితే గత ఎనిమిది సంవత్సరాలుగా భర్త పట్టించుకోకపోవడంతో తన కూతురు కుమారుడుతో పాటు కన్నతల్లి వరలక్ష్మితో కలిసి వేములవాడ పట్టణంలో కూలి నాలి చేసుకుంటూ జీవనోపాధి పొందుతోంది. దుకాణాలలో పనిచేస్తూ జీవనోపాధి పొందుతుండగా వచ్చే అరకొర జీతంతో అద్దెకు ఉండడం కూడా భారంగా మారింది. అయినప్పటికీ భగవంత రావు నగర్ లోని ఒక పాత ఇంటిలో అద్దెకు ఉండగా వర్షాకాలం నేపథ్యంలో పాడుబడిన నివాసాల్లో జన సంచారం ఉండకూడదని మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వెంటనే ఈ కుటుంబాన్ని అక్కడి నుండి బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించారు. వర్షం వచ్చి ఇల్లు కూలడం ఏమో కానీ ప్రస్తుతం ఈ కుటుంబం మాత్రం వీధిన పడింది. ఇక పది రోజులుగా అద్దె ఇంటి కోసం వెతుకుతుండగా రూ. 3వేల పైగా మాత్రమే అద్దె గదుల ధరలు ఉండడంతో అంత చెల్లించలేని దీనస్థితిలో ఉండి తక్కువ ధరకు ఒకే గది కావాలని తిరుగుతున్న అద్దె గది దొరకకపోవడంతో వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఓపెన్ జిమ్ లో తమ ఇంటి సామాను అంతటినీ పెట్టుకొని కుటుంబంతో సహా బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది. నిలువ నీడలేని తన కుటుంబానికి ప్రభుత్వం కనీసం ఉండడానికి ఒక గూడైనా కల్పించాలని మానస అధికారులను వేడుకుంటోంది.

## విద్యార్థులు విద్యా ప్రమాణాలు

### పెంపొందించుకోవాలి డీఈవో ప్రశాంత్ రెడ్డి



**చిగురుమామిడి, జూన్ 18:** విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి (డీఈవో) ప్రశాంత్ రెడ్డి అన్నారు. చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట గదులను, పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, పాఠ్యపుస్తకాలు, నోట్స్ పంపిణీ, ల్యాబ్, మొదలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలన్నారు. సెల్ఫోన్, సినిమాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయప్రద, ఉపాధ్యాయులు మంజుల, శ్రీదేవి, సరిత, భాషబత్తిని ఓదెలు కుమార్, తిరుపతి, వేణు, సూర్య ప్రకాష్, పవన్ కుమార్, చారి తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

### కేటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన



**రాజన్న సిరిసిల్ల, జూన్ 18:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టీ హరీష్ రావు పర్యటించారు. సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తనయుడు ఆశ్విన్ రావు ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. అశ్విన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సిరిసిల్ల లోని జిల్లా దహన లో తంగళ్ళపల్లి మండలం కేసీఆర్ నగర్ లో పానీపూరితిని తీవ్ర అస్వస్థకు గురైన చిన్నారులను దవాఖానలో పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.
అనంతరం సిరిసిల్లలోని సీనియర్ జర్నలిస్ట్ టీవీ నారాయణను పరామర్శిం చారు. ఇటీవలే టీవీ నారాయణ తల్లి వెంకట లక్ష్మి మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమా ల్లో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సిం గరావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్,బొల్లి రామ్మోహన్, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..